

''ధూర్తుడా! నీ వల్లనే ఈ బైరాగోడు నాకు విద్యలు చెప్పడం మానేశాడు. నీ పని చెబుతానుండు'' అంటూ ఏదో ఆకుపసరు తెచ్చి చారాయణుడి నెత్తిమీద పూశాడు.

అంతే.. మరుక్షణంలో చారాయణుడు గాడిదగా మారి పోయాడు. సిద్ధుడు బతికి ఉంటే.. చారాయణుడు కూడా మహాసిద్ధుడై ఉండేవాడు. ధారానగరానికి వెళ్లి, మిత్రులను కలుసుకుని ఉండేవాడు. విధివిధానం ఇలా ఉంటే అతను మాత్రం ఏం చేయగలడు.

* * *

ఇలా ఉండగా చారాయణుడి భార్య మల్లిక పుష్పవతి అయింది. పెళ్లయిన కూతురిని కాపరానికి పంపకుండా ఇంటిలో పెట్టుకుని కాపాడాల్సి వస్తే తల్లిదండ్రులకు అంతకంటే ఘోరమైన శిక్ష మరోటి ఉండదు. అందులోనూ చెప్పిన గడువులోపల అల్లుడు తిరిగి రాకపోయేసరికి బ్రహ్మదత్తుడికి దిగులు పట్టుకుంది. కూతురిని వెంటబెట్టుకుని, చారాయణుడిని వెతుక్కుంటూ ధారానగరానికి బయల్దేరాడు. అడవి మార్గంలో ప్రయాణిస్తున్నాడు. ఆ అడవిలో ఎనిమిది మార్గాలు కలుసుకునే చోటు ఒకటుంది. అక్కడో పుణ్యాత్ముడు ధర్మసత్రాన్ని కట్టించాడు. దానికి 'అష్టాపథ సత్రం' అని పేరు. ఆ సత్రానికి మూడు యోజనాల దూరంలో గ్రామమేదీ లేదు. ముళ్లతో, పాషాణాలతో, మృగభయాలతో నిండిన అడవిమార్గంలో చాలాదూరం నడిచివచ్చిన బాటసారులందరూ ఆ సత్రంలో కలుసుకుంటూ ఉంటారు.

ఆ సత్రానికి యాభైఆరు దేశాల ప్రజలు వస్తుంటారని వాడుక ఉండేది. బ్రహ్మదత్తుడు ఆ సత్రంలో కుటుంబంతోసహా ప్రవేశించాడు. రెండురోజులపాటు అక్కడే ఉన్నాడు. ఒకనాడు రాత్రి పండువెన్నెల కురుస్తున్నది. బ్రహ్మదత్తుడు భోజనం పూర్తి చేసి.. సత్రం అరుగు మీదికి చేరాడు. పక్క అరుగుమీద ఎవరో ఇద్దరు మాట్లాడుకుంటున్నారు. బ్రహ్మదత్తుడు వారి మాటలను ఆసక్తిగా వినసాగాడు.

ఇద్దరిలోని మొదటివాడు ఇలా అన్నాడు.

''కవీంద్రా! మీరు ధారానగరం నుంచి వస్తున్నారని చెప్పారు కదా! భోజమహారాజు కవులను గొప్పగా ఆదరిస్తాడని చెప్పుకొంటారు. ఆయన క్షేమంగా ఉన్నాడా?!''.

అందుకు ఆ కవిగారు..

''పండితోత్తమా! ఆ రాజు ప్రస్తుతం రాజధానిలో లేడు. ఎవరో కాళిదాసు మహాకవికి, భోజరాజు భార్యకూ రంకు గట్టారు. దాంతో బాధపడిన కాళిదాసు ధారానగరం వదిలి వెళ్లిపోయాడు. భోజరాజు తన భార్యను అడవిలో వదిలేయమని భటులను ఆజ్ఞాపించాడు. తరువాత చేసిన తప్పు తెలుసుకుని, వాళ్లిద్దరినీ వెతుక్కుంటూ వెళ్లాడు. ప్రస్తుతం ధారానగరంలో విద్వాంసులను ఆదరిస్తున్నారు కానీ, పరీక్షలు లేవు. ఇంతకూ మీరేమైనా కవిత్వం చెప్పగలరా?'' అని తిరుగు ప్రశ్న వేశాడు.

''ప్రౌఢంగా చెప్పలేను. ఇప్పుడిప్పుడే అలవాటు చేసుకుంటున్నాను. అయినా కవితాకన్య సహజంగా వలచి రావాలి కానీ, బలవంతం చేస్తే ప్రయోజనం ఉండదు కదా! అన్నట్లు నేనొక శ్లోకం రాశాను. వింటారా?''.

''ఇప్పుడు నిద్రవస్తున్నది. రేపు వింటాను లెండి. ఇంకా ఏవైనా విశేషాలు చెప్పండి''.

''కవిత్వం అంటే నిద్ర వస్తున్నది కానీ, విశేషాలు వినడానికి అభ్యంతరం లేదన్నమాట. సరే.. పురందరపురం విశేషాలు విన్నారా?''.

''ఆ రాజుకూతురు సరస్వతిని గురించేనా? ఆవిడ ముందు నా కవిత్వం, మీ పాండిత్యం పనికిరావు. ఆ విశేషమైతే చెప్పక్కరలేదు''.

''అదికాదు మహాశయా! ఆ సరస్వతిని కుచుమారుడు అనేవాడు ఓడించాడు. పెళ్లి చేయమని కోరుతున్నాడట. కానీ ఆమెకు ఇష్టం లేదు కాబోలు, ఏవో ఆటంకాలు చెబుతూ పెళ్లి వాయిదా వేస్తున్నది. నేనింకా ఆ పెళ్లి జరిగితే గొప్ప సంభావన దక్కుతుందని ఆశపడి వెళ్లాను. నిరాశ చేసుకుని ధారానగరం బయల్దేరాను''.

..వాళ్లిద్దరి మాటలూ ఆలకిస్తున్న బ్రహ్మదత్తుడు ముందుకు జరిగాడు.

''అయ్యా! మీరు ధారానగరం నుంచి వస్తున్నారని చెప్పారు. అక్కడ చారాయణుడనే పండితుడు కానీ, దత్తకుడు అనే ఆయన కానీ మీ కంటపడ్డారా?'' అని కవీశ్వరుణ్ని అడిగాడు.

కవిగారు సమాధానం చెప్పలేదు. మరోపక్క అరుగుమీద కూర్చున్న కుర్రవాడొకడు ముందుకు వచ్చాడు.

''చారాయణుడు, దత్తకాదులను గురించి అడుగుతున్నారేం? వాళ్లు మీకు తెలుసా?'' అని ప్రశ్నించాడు.

''ఎరుగుదును బాబూ! ఆ చారాయణుడికి నేను నా పిల్లనిచ్చాను. దత్తకాదులు తన మిత్రులని, ధారానగరం వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. గడువు దాటిపోయినా నా గడప తొక్కకపోయే సరికి, నేనే అతగాడిని వెతుక్కుంటూ బయల్దేరాను'' అన్నాడు బ్రహ్మదత్తుడు.

''ఓహో! అయితే మీరు మాకు పూజ్యులు. మీ అల్లుడు నాకు మిత్రుడే! నాపేరు ఘోటకముఖుడు అంటారు. నా మిత్రులందరూ ఈ పాటికి ధారానగరం చేరుకుని ఉంటారు. నాకు దారిమధ్యలో విఘ్నాలు ఎదురు కావడం వల్ల వెళ్లలేకపోయాను'' అన్నాడతను.

''అయ్యో! ఏమైంది బాబూ?'' అని ప్రశ్నించాడు బ్రహ్మదత్తుడు.

దానికి ఘోటకముఖుడు ఇలా సమాధానం చెప్పాడు.

''అయ్యా! ఒక మహనీయుని భార్యను భైరవుడు అనేవాడు ఎత్తుకుపోయాడు. వాడికోసం తిరుగుతున్నాను. వాడిప్పుడు పురందరపురంలో ఉన్నాడని తెలిసింది. నేను ఆ పని పూర్తి చేసుకుని, ధారానగరం వస్తానని నా మిత్రులతో చెప్పండి''.

బ్రహ్మదత్తుడికి ఆ మాటతో మహదానందం కలిగింది.

''బాబూ! నీ మిత్రుని భార్యను చూద్దువుగాని రా'' అని తన గది వద్దకు తీసుకువెళ్లాడు.

ఆ అమ్మాయిని చూసి, తన మిత్రుడికి తగిన భార్య లభించిందని ఘోటకముఖుడు సంతోషించాడు. బ్రహ్మదత్తుని ఆదరానికి సంతోషించి, అతణ్ని తన గది వద్దకు తీసుకువెళ్లాడు.

అక్కడ ఉన్న పెద్దమనిషిని పరిచయం చేశాడు.

''ఈయన భార్యనే భైరవుడు ఎత్తుకుపోయాడు. వాణ్ని వెతుకుతూనే మేమిద్దరం పురందరపురం వెళ్తున్నాం'' అన్నాడు.

ఆ పెద్దమనిషిని చూడగానే ఎవరో ఒక దేశాధికారి అయి ఉంటాడని భావించిన బ్రహ్మదత్తుడు.. అందుకు తగిన విధంగా ఆశీర్వదించాడు. అతని భార్య త్వరలోనే దొరకగలదని ఓదార్చి, తన గదికి తిరిగి వెళ్లిపోయాడు.

నిజానికి ఆ పెద్దమనిషి ఎవరో ఘోటకముఖునికే తెలియనప్పుడు.. బ్రహ్మదత్తుడికి మాత్రమెలా తెలుస్తుంది?! అతడే భోజమహారాజు.

మరునాడు భోజుడు, ఘోటకముఖుడు కలిసి పురందరపురానికి వెళ్తూ.. బ్రహ్మదత్తుని గదికి వచ్చారు. అతని కూతురు, భార్య కూడా పండిత కవులే అని తెలిసి భోజుడు సంతోషించాడు.

''అమ్మాయిలూ! నేను మీకు తండ్రి వంటివాణ్ని. నాకు కవులంటే మహాప్రీతి. నేనిచ్చే సమస్యను మీరు నలుగురూ పూరిస్తే వినాలని ఆశ పడుతున్నాను'' అంటూ ఈ దిగువ సమస్యను ఇచ్చాడు.

**క్రియాసిద్ధిస్సత్వే భవతి మహతాంనోపకరణైః**

'మహాత్ములకు కార్యసిద్ధి అనేది తమ ప్రభావం చేతనే కలుగుతుంది. వారికి ఉపకరణాలతో పని లేదు' అని ఈ సమస్యకు అర్థం. ఘోటకముఖుడితో పాటుగా బ్రహ్మదత్తుని భార్య కూడా ఆ సమస్యను తలోవిధంగా పూరించారు. వారందరూ చెప్పిన శ్లోకాల అర్థాలు స్థూలంగా ఇలా ఉంటాయి.

కుండలో పుట్టి, మృగాలతో కూడిన అడవులలో సంచరించే అగస్త్యుడు సముద్రాన్నే పుక్కిట పట్టాడు. తాను మానవుడై పుట్టిన శ్రీరాముడు కోతులతో కలిసి, సముద్రంపై రాళ్లు తేలించి లంక ముట్టించాడు. రావణుణ్ని తుదముట్టించాడు. ఒక చక్రం గల బండినెక్కి, నిరాలంబమైన ఆకాశంలో, కాళ్లులేని సారథితో సూర్యుడు తిరుగుతున్నాడు. కాబట్టి మహాత్ములకు కార్యసిద్ధి కలగాలంటే గొప్ప ఉపకరణాలు ఉండాల్సిన పనిలేదు.

చివరిగా బ్రహ్మదత్తుడి కూతురైన మల్లిక ఈ విధంగా పూరించింది.

''పువ్వులను విల్లుగా ధరించి, వాటికి తుమ్మెదల నారి సారించి.. స్త్రీల చంచల దృక్కులనే బాణాలను ఎక్కుపెట్టి.. మన్మథుడు దేహం లేనివాడైనా ముల్లోకాలనూ వ్యాకుల పెడుతున్నాడు''..

..ఆ నలుగురి పూరణలలో మల్లిక చెప్పిందే రసవంతంగా ఉందని భోజునికి అనిపించింది.

''ఈసారి మిమ్మల్ని ధారానగరంలో కలుసుకున్నప్పుడు భోజరాజుతో చెప్పి.. నీ శ్లోకానికి అక్షర లక్షలిప్పిస్తాను'' అని పలికాడు.

బ్రహ్మదత్తుని వద్ద సెలవు తీసుకుని ఘోటకముఖునితో కలిసి పురందరపురానికి వెళ్లాడు. ■

**(వచ్చేవారం.. కుచుమారుడు గెలిచాడు)**